

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 08-07-2025 సంపుటి : 07 సంచిక : 57 పేజీలు : 8 వెల : రూ 3-00

## భారత్, పాక్‌ను ఒకే త్రాసులో తూకం వేయలేం : ప్రధాని మోదీ



బ్రెజిల్ జూలై 7,;జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పొరుగుదేశం పాకిస్థాన్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. పాక్ ఉగ్రవాద మద్దతుదారని, భారత్ ఉగ్రవాద బాధిత దేశమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ రెండింటినీ ఒకే త్రాసులో తూకం వేయలేమన్నారు. 'పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తోంది. భారత్ మాత్రం ఉగ్రవాద బాధితురాలిగా ఉంది. ఈ రెండింటినీ ఒకే త్రాసులో తూకం వేయలేం' అని ప్రధాని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు మౌనంగా మద్దతు ఇవ్వడం కూడా ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిని ఖండించడంలో భారతదేశానికి మద్దతుగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.పహల్గాం ఉగ్ర దాడిని ఖండించిన బ్రిక్స్..బ్రెజిల్‌లోని రియో డీ జెనీరలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్ర దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రదాడులు ఎక్కడ జరిగినా ముక్త కంఠంతో ఖండిస్తున్నామని, టెర్రరిజం ఏ రూపంలో ఉన్న వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశాయి. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు 'రియో డీ జెనీరో డిక్లరేషన్'ను సభ్యదేశాలు విడుదల చేశాయి .'ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తున్నాం. క్రాస్ బార్డర్ టెర్రరిజంతోపాటు ఉగ్రమూకలకు నిధులు అందిస్తూ, ఆశ్రయం కల్పించడాన్ని ఖండిస్తున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో కలిసికట్టుగా ముందుకు వెళ్తాం. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థల పట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని అందులో పేర్కొన్నాయి. అయితే ఈ తీర్మానంలో ఎక్కడా పాకిస్థాన్ పేరు ప్రస్తావించలేదు

## కేవలం రూ.100తో భూముల రిజిస్ట్రేషన్..

అమరావతి, జులై 07: ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో నామమాత్ర ఫీజుతో.. వారసత్వ భూముల సక్సెషన్ రిజిస్ట్రేషన్లు త్వరలో ప్రారంభించేందుకు సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. చర్యలను వేగవంతం చేసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం సదరు ఆస్తి విలువ రూ. 10 లక్షల లోపు ఉంటే.. రూ. 100, అంతకంటే ఎక్కువ ఉంటే రూ. 1000 ఫీజును స్టాంపు డ్యూటీ కింద తీసుకోనున్నారు.

**అందుకే ఈ నిర్ణయం..** ఆస్తి యజమానులు మరణించిన అనంతరం వారసులకు సంక్రమించే వాటికి మాత్రమే గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. తల్లిదండ్రులు మరణించిన అనంతరం వారసత్వంగా వచ్చే ఆస్తులను వారసులు.. తహసీల్దారుకు దరఖాస్తు చేసి, కాగితాలపై రాసుకుంటున్నారు. అయితే వీటికి మ్యుటేషన్లు జరగడం లేదని.. తహసీల్దారు కార్యాలయ సిబ్బంది పలుమార్లు తిప్పుతున్నారంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. గత ఒక్క ఏడాదిలో 55 వేలకు పైగా ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. అదీకాక.. తమ ఆస్తికి ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించాలనే ఉద్దేశంతో పలువురు ఉంటున్నారు. దీని వల్ల చనిపోయిన వారి పేర్లు భూముల రికార్డుల్లో అలాగే ఉండిపోతున్నాయి. దీంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

**ప్రభుత్వ అంచనా..** గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో మరణ ధృవీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. యజమాని మరణించిన అనంతరం వచ్చిన ఆస్తులను వారసులు భాగాలుగా చేసుకుని లిఖితపూర్వకంగా ఏకాభిప్రాయంతో వస్తే.. గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో పని చేసే డిజిటల్ అసిస్టెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తారు. సచివాలయాల్లో.. అది కూడా నామమాత్రపు ఫీజులతో రిజిస్ట్రేషన్ చేయడం



ద్వారా వారసులు ముందుకు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తుంది.

సీఎంచంద్రబాబు సమీక్ష..ఇక రిజిస్ట్రేషన్ చేయడం వల్ల భూముల రికార్డుల్లో వివరాలు నమోదు ఆటోమేటిగ్గా జరుగుతుంది. ఆ వెంటనే ఈ పాస్ బుక్ జారీ అవుతుంది. ఆ క్రమంలో వారసుల వద్ద నుంచి ఈ కేవైసీ సైతం తీసుకుంటారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించి.. ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ నుంచి ఈ విధానం అమలుపై మార్గదర్శకాలు రానున్నాయి. అందుకోసం రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ చర్యలు తీసుకుంటుంది. అందుకోసం రెండు, మూడు మాసాల సమయం పట్టనుందని తెలుస్తోంది.

**వైసీపీ పాలనలో గందరగోళం..** గత వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో అనాలోచితంగా ప్రవేశపెట్టిన దస్తావేజుల రిజిస్ట్రేషన్ గందరగోళానికి దారితీసింది. కానీ ప్రస్తుతం వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్ చేస్తారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరగనుంది. అందుకోసం డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తుందని తెలుస్తుంది.


## ఏపీలో ఎక్కడా లేని విధంగా ఆ ప్రాజెక్ట్ పూర్తి చేశాం: మంత్రి పయ్యావుల




అనంతపురం: ఏపీలో ఎక్కడా లేని విధంగా ఆరునెలల్లోనే తాగునీటి ప్రాజెక్ట్ పూర్తి చేశామని మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. అనంతపురంలోని ఉరవకొండలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడారు. ఉరవకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యని శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. ఉరవకొండ పట్టణానికి తాగునీరు అందించేందుకు జనవరి ఒకటోవ తేదీన తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించామని గుర్తుచేశారు మంత్రి పయ్యావుల కేశవ్.నేడు పనులు పూర్తి చేసి ప్రాజెక్ట్‌ని ప్రారంభించామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రూ. 22కోట్లతో కేవలం ఆరునెలల్లోనే తాగునీటి ప్రాజెక్ట్ పూర్తిచేశామని తెలిపారు. ఆరోజే తాను చెప్పానని.. తనను గెలిపించిన ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని అన్నారు. ఈ రోజు ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించానని చెప్పుకొచ్చారు. వైసీపీ నేత వై. విశ్వేశ్వర్ రెడ్డి ఒక అసమర్థుడని చెప్పడానికి ఇదే నిదర్శనమని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు.కూటమి నాయకులు ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచాలని మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఏడాదిలో తమ ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలు ఆలోచించాలని అన్నారు. ఇవాళ(సోమవారం) పల్నాడు జిల్లాలోని యడ్లపాడు మండలం ఇర్లపాడులో కీ.శే. వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ప్రత్తిపాటి పుల్లారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడారు. వంగవీటి రంగా ఒక్క కులానికి పరిమితం కాదని.. ఆయన పేదల మనిషి అని కొనియాడారు. వంగవీటి రాధాకృష్ణ ప్రజాహితం కాంక్షించే నిస్వార్థ నాయకులని ప్రశంసించారు. ప్రజలకోసం, కూటమి ప్రభుత్వ పక్షాన వంగవీటి రాధాకృష్ణ నిలబడ్డారని చెప్పుకొచ్చారు.

## అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్ ఉత్తర్వులు జారీ

అమరావతి, జులై 7: అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జీవో ఆర్టీ నెంబర్ 23ను ఐటీ ఎలక్ట్రనిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని ఈరోజు (సోమవారం) జారీ చేశారు. జూన్ 30న విజయవాడలో 'అమరావతి క్వాంటం వ్యాలీ వర్క్‌షాప్'ను నిర్వహించినట్టు ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా ప్రభుత్వ, పరిశ్రమ, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు కలిసి కొత్త టెక్నాలజీని సమన్వయంతో పనిచేసే దిశగా చర్చలు జరిగాయన్నారు.అమరావతిని గ్లోబల్ క్వాంటం టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 'అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్'ను జూన్ 30న ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ డిక్లరేషన్‌పై నేడు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల ద్వారా క్వాంటం పరిశోధన, ఆవిష్కరణ, ప్రతిభ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇవ్వనునట్టు వెల్లడించారు. దేశంలోనే అతి పెద్ద క్వాంటం బెడ్‌గా క్యూ - చిప్ - ఇన్‌ను వచ్చే 12 నెలల్లో అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2035 నాటికి ప్రపంచ క్వాంటం కేంద్రంగా అమంరావతి అభివృద్ధే లక్ష్యమని ఉత్తర్వుల్లో తెలిపారు. 2026లో ప్రారంభం అయ్యే అమరావతి క్వాంటం అకాడమీ ద్వారా శిక్షణ, ఫెలోషిప్‌లు అందజేయ వాలని ప్రభుత్వం నిర్ణయించింది.



## తల్లికి వందనం, అన్నదాత పథకం అర్హులైన వారికి అందజేయండి :జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 07-రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు పథకాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, డెంగ్యూ, పి4 మార్గదర్శి-బంగారు కుటుంబాలపై అధికారులకు కలెక్టర్ సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.....రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం రెండవ విడత జాబితాను ఈ నెల 10వ తేదిలోపు సిద్ధం చేయాలన్నారు. నూతంగా అంగన్వాడీ నుండి ఒకటవ తరగతి, ఐదవ తరగతి నుండి ఆరవ తరగతిలో నూతనంగా చేరిన విద్యార్థిని, కూడా జాబితాలో చేర్చి తల్లికి వందనం అందేలా చూడాలన్నారు. అందుకు తల్లి బ్యాంకు ఖాతా, ఆధార్ కు అనుసంధానం అయ్యిందో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. అదే విధంగా మండల పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు ఎటువంటి సాంకేతిక సమస్యలు ఉన్న గ్రామ సచివాలయ కోఆర్డినేటర్ దృష్టికి తేవాలన్నారు. పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.పి4 (పబ్లిక్-ప్రైవేటు-పీపుల్స్-పార్ట్నర్ షిప్) సంబంధించి ఆగస్టు 15వ తేది నాటికి జిల్లాలో నమోదైన బంగారు కుటుంబాలకు చేయూతను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జిల్లా అధికారులు కూడా మార్గదర్శులుగా నమోదై బంగారు కుటుంబాలకు అవసమైన చేయూతను అందజేయాలన్నారు.వివిధ శాఖలకు సంబంధించి వార్త పత్రికల్లో వచ్చే ప్రతికూల అంశాలపై జిల్లా అధికారులు సంబంధిత మండల అధికారుల నుండి సరైన వివరణ తీసుకోవాలన్నారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ, రీసర్వే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించండి:జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 07-ప్రజా అర్జీల పరిష్కారంలో నాణ్యతను పెంచి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు మెరుగైన దృష్టి సారించాలన్నారు. జిల్లాలో రెవెన్యూ, రీసర్వే అంశాలపై ఎక్కువ శాతం ఫిర్యాదులు రావడం జరుగుతుందని అందుకు ఆర్డీఓలు, తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.ముఖ్యంగా ఆర్డీఓలు ప్రతి రోజూ తహశీల్దార్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అర్జీలు



బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించేలా చూడాలన్నారు. రీఓపెన్, గడువులోపల అర్జీలపై నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సమీక్ష చేయడం జరుగుతుంది కాబట్టి వాటి పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ప్రజా పరిష్కార వేదికకు వచ్చే విభిన్న ప్రతిభావంతుల కోసం 3 సహాయకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 221 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. సదురు సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 08-07-2025

## బ్యూటీ ఫుల్ బిల్ ఎవరికి లాభం...ఎవరికి నష్టం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతో ఇంట్రెస్ట్ గా తీసుకొచ్చిన వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్ తో ఎవరికి లాభం.. ఎవరికి నష్టం అన్న చర్చలు జరుగుతున్నాయి. ఆహా ఓహో అని వైట్ హౌజ్, ట్రంప్, రిపబ్లికన్లు ప్రచారాలు పెంచారు. అదే సమయంలో ధనవంతులకే లాభం చేసి పేద అమెరికన్ల పొట్టకొట్టేలా ఉందని రిపబ్లికన్లు కార్నర్ చేస్తున్నారు940 పేజీల బిల్లు అమెరికాలో పెద్ద చర్చకే దారి తీసింది. ప్రభుత్వ వ్యయాన్ని తీవ్రంగా తగ్గించడం, వలస చట్టాలను అమలు చేయడానికి కావాల్సిన కఠినమైన కొత్త విధానాలకు నిధులు సమకూర్చడం, పలు పన్ను కోతలను శాశ్వతం చేయడం వంటివి ఈ చట్టంలో ఉన్నాయి. అమెరికా రాజకీయాల్లో, ఇటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉండడంతో ఈ బిల్లు అందరి అటెన్షన్ కు కారణమైంది.. 2017లో అమలైన పన్ను కోతలను శాశ్వతం చేయడం ద్వారా, ఈ బిల్లు అమెరికన్లకు సంవత్సరానికి సగటున 2,900 డాలర్లు ఆదా చేస్తుందని ట్యాక్స్ పాలసీ సెంటర్ అంచనా వేసింది. మధ్యతరగతి, అధిక ఆదాయం గల వ్యక్తులు అంటే ఏటా 30 వేల డాలర్ల నుంచి 80 వేల డాలర్లు సంపాదించేవారికి 15% ట్యాక్స్ తగ్గింపును పొందుతారు. ఇది వారి టేక్ హోమ్ పే ని ఏడాదికి 10 వేల డాలర్ల నుంచి 13 వేల డాలర్లకు పెంచనుంది. అధిక ఆదాయం ఉన్న వారు, అలాగే వారసత్వ ఆస్తులు ఉన్నవారు భారీగా ట్యాక్స్ రాయితీలు పొందుతారు. అటు మధ్యతరగతి కుటుంబాలు ట్యాక్స్ రిలీఫ్ ద్వారా రిలీఫ్ పొందుతాయి. ముఖ్యంగా పిల్లలు ఉన్నవారు. ఇక ఏటా 9 లక్షలకు పైగా డాలర్లు సంపాదించే వారికీ బెనిఫిట్స్ ఇచ్చారు ట్రంప్. కార్పొరేట్ కంపెనీలకు లాభం జరగనుంది. ఓవర్‌టైమ్‌పై 12,500 డాలర్లకు నో ట్యాక్స్ కట్. టిప్స్ లేదా ఓవర్‌టైమ్ ద్వారా సంపాదించే ఆదాయంపై 2028 వరకు ట్యాక్స్ రాయితీ ఉంటుంది. దీనివల్ల ఈ వర్గాల వారు సంవత్సరానికి 1,300 నుంచి 2 వేల డాలర్లు ఆదా చేయవచ్చు. టిప్స్‌పై 25 వేల డాలర్లు, ఓవర్‌టైమ్‌పై 12 వేల 500 డాలర్ల దాకా సంపాదించే వారికి ట్యాక్స్ డిడక్షన్ బెనిఫిట్. 65 ఏళ్లు పైబడిన వారికి అదనపు 4,000-6,000 డాలర్ల స్టాండర్డ్ డిడక్షన్ లభిస్తుంది. 88% సీనియర్స్‌కు ట్యాక్స్ రహిత బెనిఫిట్స్ అందిస్తుంది. అటు అమెరికన్ తయారీ కంపెనీలు, అలాగే చిన్న వ్యాపారాలకు 100 శాతం ఎక్స్‌పెన్సింగ్ అలాగే ట్యాక్స్ రాయితీలు ఈ బ్యూటిఫుల్ బిల్లుతో లభిస్తాయి. దీనివల్ల వారు ఎక్కువ ఉద్యోగాలను సృష్టించవచ్చు. వ్యాపార విస్తరణకు మేలు, అలాగే దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. 20 లక్షల రైతు కుటుంబాలకు మేలు. ఎస్టేట్ ట్యాక్స్ ఎక్సెంప్షన్ రెట్టింపు కావడం వల్ల 20 లక్షల రైతు కుటుంబాలు తమ ఆస్తులను వారసత్వంగా ఇవ్వడంలో ట్యాక్స్ భారం నుండి రక్షణ పొందుతారు. దీంతో అమెరికన్ రైతులకు ఆర్థిక స్థిరత్వం లభిస్తుంది. అమెరికన్ తయారీ కార్లపై ఆటో లోన్ ఇంట్రెస్ట్ డిడక్షన్ ఇచ్చారు. దీంతో అమెరికన్ కార్ల కొనుగోలును ప్రోత్సహిస్తుంది. దేశీయ ఆటోమొబైల్ రంగానికి బూస్ట్ ఇచ్చేలా బిల్లులో ప్రస్తావించారు. అటు సైనిక రంగంలో ఆధునీకరణ, జాతీయ భద్రత, ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఉద్యోగ సృష్టి, మౌలిక సదుపాయాల వృద్ధి కోసం బెనిఫిట్స్ కల్పించారు.డ్రగ్ ట్రాఫికింగ్ నిరోధానికి, ఆర్కిటిక్‌లో జాతీయ భద్రత, సముద్ర రవాణా రంగంలో బలోపేతం అయ్యేలా బిల్లులో ప్రోత్సహించారు. ఏవియేషన్ రంగంలో సామర్థ్యం, భద్రత పెంచడానికి చర్యలు తీసుకున్నారు. చారిటబుల్ డొనేషన్స్‌ను ప్రోత్సహించేలా బిల్లు ఉంది. ఇది నాన్-ప్రాఫిట్ సంస్థలకు ఫండింగ్ పెంచబోతోంది. న్యూక్లియర్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు, వృద్ధికి ప్రోత్సాహం కల్పించారు. విద్యార్థుల లోన్లనూ టార్గెట్ చేసిన ట్రంప్. ఇక ఈ బ్యూటిఫుల్ ట్యాక్స్ బిల్లుతో ఎవరికి నష్టమో ఇప్పుడు చూద్దాం. తక్కువ ఆదాయం ఉన్న వారిపై ట్రంప్ గట్టి దెబ్బే కొట్టాడు. సంవత్సరానికి 17 వేల డాలర్ల కంటే తక్కువ సంపాదించే వారికి మెడికేడ్, ఆహార కోతల వల్ల సగటున 1,600 డాలర్ల నుంచి 22 వేల డాలర్లు నష్టపోవచ్చుంటున్నారు. అసలు బెనిఫిట్ చేయాల్సిందే పేద అమెరికన్లకు. కానీ ట్రంప్ మాత్రం ఎందుకో పేద అమెరికన్ల పొట్టగొట్టాడంటున్నారు అక్కడి డెమొక్రాట్లు, సామాజిక సంస్థలు. అలాగే విద్యార్థుల లోన్లనూ టార్గెట్ చేశారు. స్టూడెంట్స్, అలాగే వర్సిటీలకు నష్టం. క్లీన్ ఎనర్జీ రంగానికి ట్యాక్స్ క్రెడిట్స్ మైనస్. అటు క్లీన్ ఎనర్జీ రంగానికి ట్యాక్స్ క్రెడిట్స్ మైనస్ చేశారు. దీంతో సోలార్, విండ్, ఎలక్ట్రిక్ వెహికల్ రంగాలకు షాకింగ్ గా మారింది. ఈ బిల్లు స్పేస్ బేస్డ్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్ ? గోల్డెన్ డోమ్ కోసం ఫండింగ్‌ను కేటాయించినప్పటికీ, అంతరిక్ష రంగంలో ప్రైవేట్ కంపెనీలకు అంటే జెఫ్ బెజోస్ సహా మస్క్ కు చెందిన స్పేస్ ఎక్స్ వంటి వాటికి నేరుగా ట్యాక్స్ ఇన్సెంటివ్స్ లేదా ఫండింగ్ పై స్పష్టత ఇవ్వలేదు. ఎలాన్ మస్క్ ఈ బిల్లును విమర్శించడానికి ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటి. అటు వలసదారులకు వీసా ఫీజుల్ని పెంచారు. చాలా సబ్సిడీల నుండి ఇమ్మిగ్రెంట్స్‌ను మినహాయించేశారు. దీంతో అమెరికాలో చట్టబద్ధంగా ఉన్న వలసదారులు చాలా నష్టపోతారు. సో ఈ బిల్లు వల్ల ఫెడరల్ డెఫిసిట్ వి3.3-వి3.8 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని, దీనివల్ల భవిష్యత్ తరాలపై రుణ భారం పెరుగుతుందంటున్నారు. సో ఈ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు ట్రంప్ ఉత్సాహంగా తీసుకొచ్చినా లాభ నష్టాలపై ఇంకా ఆందోళన తొలగడం లేదు. అమెరికా నుంచి ఇండియాకు డబ్బులు పంపడానికి లిమిట్ పెట్టారా.. వచ్చే ఏడాది జనవరి 1 నుంచే ఔఖీఎల నెత్తిపై ట్రంప్ పెద్దబాంబే పెట్టాడు. 2026 జనవరి 1 నుంచి అమెరికా నుంచి భారత్‌కు పంపే క్యాష్ ఆధారిత ట్రాన్స్ ఫర్స్ పై 1% పన్ను విధించారు.

## గంజాయి, ఇసుక మాఫియాకు అడ్డాగా కోదాడ : మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



...ందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య ...తో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ...ో పాటు గ్రామాలకు విస్తరించడంతో ...డ మండలం దొరకుంట, అనంతగిరి ...ంగా ఆయన ప్రస్తావించారు. గతంలో ...మార్‌రెడ్డి, ఉత్తమ్ పద్మావతి ఇప్పుడేం ...మద్దతుతో గంజాయి, ఇసుక అక్రమ ...క్ష్యమని గొప్పలు చెప్పుకునే మంత్రి ఉ... గాడి తప్పిందన్నారు. పైలట్ ప్రాజెక్ట్ ... ఇసుకను తరలిస్తూ ఎక్కువ రేటుకు అమ్ముతున్నప్పటికీ పట్టించుకునే దిక్కేలేదని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణాలు, పల్లెలు పచ్చదనంతో కళకళలాడితే, నేడు గ్రామాల్లో ట్రాక్టర్ డీజిల్‌కు డబ్బులు లేక పారిశుధ్యం లోపంతో కంపు కొడుతున్నాయని విమర్శించారు. ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఎన్ని సమీక్షలు చేసినా ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదన్నారు. కోదాడ ప్రభుత్వ దవాఖానాలో రెండేడ్లుగా ప్రసూతి వైద్యురాలు లేక నిరుపేదలు ప్రైవేట్ దవాఖానాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో పాటు రైతులకు అవసరమైన యూరియాను కూడా సకాలంలో సరఫరా చేయకపోవడం దురదృష్టకరమన్నారు. సంబంధిత శాఖల అధికారులను అప్రమత్తం చేసి సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదన్నారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సుంకర అజయ్ కుమార్, కవిత, రమేశ్, నర్సిరెడ్డి, భూపాల్ రెడ్డి, సురేశ్, నయీమ్, మధుసూదన్ రెడ్డి, కర్ల సుందర్ బాబు, లలితా రామారావు, వెంకట్, చంద్రశేఖర్, ఇమ్రాన్ ఖాన్, ఉపేందర్, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


చర్లపల్లి, జూలై 7 : నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్, చర్లపల్లి డివిజన్ పరిధిలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో జిల్లా వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నోట్‌బుక్స్, వివిధ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా వాసవి మిత్ర మండలి పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, పేదల సంక్షేమానికి కృషి చేయడం



హర్షనీయమన్నారు. అనంతరం వాసవి మిత్ర మండలి ప్రతినిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవివాత్ర మండలి అధ్యక్ష, కార్యదర్శులు పెద్ది నాగరాజుగుప్తా. రెబిల్లి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు నందిని, ప్రతినిధులు రాముని తిరుమల్లేశ్, గంప కృష్ణ, అమర కృష్ణ, అనుముల నర్సింగ్‌రావు, నగేశ్, శ్రావణ్‌కమార్, ముత్యాలు, శ్రీనివాస్, చందా సంతోష్, కూర శ్రీనివాస్, మురళి, వీబీవీ.కృష్ణ, నాగేశ్వర్‌రావ, హనుమంత్‌రావు, రామచంద్రా, తారకేశ్వర్, భగవాన్, కైలాసం, సంతోష్, శ్రీనివాస్, జగదీష్, నాగరాజు, తాటి శ్రీనివాస్, నవీన్, అరుణ్, శివ, గిరిబాబు, నేమూరి మహేశ్‌గౌడ్, ఎంకిరాల నర్సింహ్మా, లక్ష్మినారాయణ, బాల్‌రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

## 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'పై సుప్రీంలో పిటిషన్‌లో.. ఈ నెల 10న విచారించనున్న సర్వోన్నత న్యాయస్థానం..

ఓటర్ జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూఎఖీ) ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న సుప్రీంకోర్టు విచారించనున్నది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యల చెల్లుబాటును పరిశీలించనున్నట్లు పేర్కొంది. పలువురు పిటిషన్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వినిపించిన వాదనలను పరిగణలోకి తీసుకున్న జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి బెంచ్ గురువారం కేసును విచారించేందుకు అంగీకరించింది. ఈ పిటిషన్‌లపై ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేయాలని బెంచ్‌ను సిబల్ కోరగా.. విచారణ జరుగుతుందని జస్టిస్ సుధాన్షు తెలిపారు. బిహార్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూఎఖీ) నిర్వహించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను సవాల్ చేస్తూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా,



టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాతో పాటు ఏడీఆర్ సంస్థ పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూఎఖీ) ప్రక్రియను వెంటనే అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని మనోజ్ ఝా కోరారు. ఈసీ ఉత్తర్వులు ఉత్తర్వు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కు-వ్యక్తిగత స్వేచ్ఛ), ఆర్టికల్ 325 (కులం, మతం, లింగం ఆధారంగా ఎవరినీ ఓటరు జాబితా నుంచి మినహాయించకూడదు), ఆర్టికల్ 326 (18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులు)లను ఉల్లంఘిస్తుందని.. ఆదేశాలను రద్దు చేయాలని మనోజ్ ఝా కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూఎఖీ) రాజ్యాంగంలోని నిబంధనలు ఉల్లంఘించిందని ఎంపీ మహువా మొయిత్రా ఆరోపించారు. ఇది ఇలాగే కొనసాగితే దేశంలో పెద్ద సంఖ్యలో ఓట్లు కోల్పోయే అవకాశం ఉంటుందని పేర్కొంది. ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలను బలహీనంగా మారుస్తుందన్నారు. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ంఆఖీ) సైతం పిటిషన్ దాఖలు చేసింది.

## అక్రమ సంబంధం అనుమానంతో ఒకరికి కత్తిపోట్లు

నాగర్ కర్నూలు,భార్య మీద అనుమానంతో ఓ వ్యక్తిని కత్తితో పొడిచిన ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. వెల్దండ మండలం రాచూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన చిలకమర్తి బాలసుబ్రమణ్యం అనే వ్యక్తి పై చేసిన కత్తిపోట్ల కలకలం లేపింది.. రాచూరు గ్రామానికి చెందిన మాదుగుల సదా మంత్, భార్య, బంధువు అనారోగ్యంతో గాంధీ ఆస్పత్రిలో సర్జరీ కోసం చేరారు. భార్య అదే ఆసుపత్రిలో పనిచేస్తున్న ఏపీకి చెందిన చిలకమర్తి సుబ్రమణ్యం అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ఇద్దరి మధ్య చనువు పెరగడంతో తరచూ కలుసుకు వస్తున్నారు... ఇద్దరి ప్రవర్తన భర్తకు అనుమానం వచ్చింది. దాంతో బాలసుబ్రహ్మణ్యాన్ని గ్రామానికి పిలిపించి ఆమె ఇంట్లోనే ఇద్దరు కలిసి మద్యం సేవించారు. నా భార్యతో అక్రమ సంబంధం పెట్టుకుంటావా అంటూ అతనిపై దాడి చేసి కత్తితో మూడు పోట్లు పొడిచాడు దాంతో అతను అరుపులు కేకలు పెట్టుకుంటూ తప్పించుకుని కల్వకుర్తి ఆసుపత్రికి చేరాడు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతని ఫిర్యాదు మేరకు వెల్దండ ఎస్సై గురుమూర్తి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## యూరియా అవసరం మేరకు మాత్రమే వాడాలి : వ్యవసాయాధికారి వెంకట్రావమ్మ



కొమురవెల్లి, జూలై 7 : రైతులు అవసరం మేర మాత్రమే యూరియాను వాడాలని కొమురవెల్లి మండల వ్యవసాయాధికారి వెంకట్రావమ్మ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ యూరియా తేలికగా నీటిలో కరుగుతుందని, గాలిలో కలిసిపోవడం వలన గాలి, నీరు కాలుష్యం అవుతుందన్నారు.ఎక్కువ యూరియా వాడటం వలన ధాన్యపు పైర్లు విపరీతంగా పెరిగి పడిపోవడమే కాకుండా పూత ఆలస్యంగా వచ్చి పంటకాలం పెరుగడంతోపాటు తాలు గింజలు వస్తాయన్నారు. అధికంగా యూరియా వాడటం వలన పంట చేను దగ్గరికి చీడపీడలు సులభంగా చేరుతాయన్నారు. అదే విధంగా పెట్టుబడులు పెరిగి దిగుబడి తగ్గుతుందన్నారు. కాబట్టి రైతులు యూరియా తక్కువగా వాడి ఎక్కువ లాభాలు పొందాలన్నారు.

## వైటీపీఎస్ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తాం : మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



దామరచర్ల, జులై 07 : యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెంలో మాజీ ఎంపీటీసీ రాయికింది సైదులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వాసితులు, రైతులతో ఆయన సమావేశమయ్యారు. తాళ్లవీరప్పగూడెంలో రైతులు నాడు భూ సేకరణకు అభ్యంతరం తెలిపితే అప్పటి మంత్రి జగదీశ్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తాను ప్లాంట్ ఏర్పాటుతో జరిగే అభివృద్ధిని వివరించి స్థానికులను ఒప్పించి భూసేకరణ జరిగేలా చొరవ తీసుకున్నామని తెలిపారు.కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్వాసితులకు అన్యాయం చేస్తుందని ఆక్షేపించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎం రేవంత్ రెడ్డిని కలిసి నిర్వాసితులకు న్యాయం చేసేంత వరకు పోరాడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దుర్గంపూడి నారాయణ రెడ్డి, ఎండీ. యూసుఫ్, అంగోతు హాతీరాం నాయక్, కటికం సైదులురెడ్డి, సోము సైదిరెడ్డి, దారగని వెంకటేశ్వర్లు, కొనకంచి సత్యనారాయణ, కొనకంచి నర్సయ్య, నల్లబద్ధీ సైదయ్య, గోవిందు, కందుల నాగిరెడ్డి, ప్రకాష్ నాయక్, పర్శియా నాయక్, హానిమి రెడ్డి, నేనావత్ బాలూనాయక్, కొట్యానాయక్, వినోద్ నాయక్, అనిల్ నాయక్, సురేశ్ నాయక్ రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హిమాచల్ ప్రదేశ్‌లో నీట మునిగిన బ్యాంకు.. కోట్లలో నష్టం అంచనా

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌ను వరదలు ముంచెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర సహకార బ్యాంకు నీట మునిగింది. లక్షల్లో నగదు, లాకర్లలో దాచిన నగలు, విలువైన పత్రాలు పాడైనట్లు భావిస్తున్నారు. దీంతో కోట్లలో నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మండి జిల్లాలోని తునాగ్‌లో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు చాలా ప్రసిద్ధి. సమీపంలోని పట్టణాలకు చెందిన వందలాది మంది వ్యాపారులు, వేలాది మంది ఖాతాదారులు తమ డబ్బును ఈ బ్యాంకులో డిపాజిట్ చేస్తుంటారు. నగదుతోపాటు నగలు, విలువైన పత్రాలను బ్యాంకు లాకర్లలో దాచుకున్నారు.కాగా, జూన్ 20 నుంచి జూలై 6 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రాన్ని 23 ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వర్షాలు, వరదలకు మండి జిల్లా అతలాకుతలమైంది. ఈ నేపథ్యంలో తునాగ్ మార్కెట్ ప్రాంతంలోని రెండతస్తుల బిల్డింగ్‌లో ఉన్న రాష్ట్ర సహకార బ్యాంకు వరద నీటిలో పూర్తిగా మునిగిపోయింది. నీటి ప్రవాహం ఉధృతికి ఒక షట్టర్ పైకి లేచింది. మరో రెండు షట్టర్‌లు వంకరపోయాయి.మరోవైపు వరద నీటి వల్ల ఆ బ్యాంకులోని లక్షలాది నగదుతోపాటు లాకర్లలో ఉన్న నగలు, డబ్బు, ఇతర పత్రాలు పాడై ఉంటాయని బ్యాంకు అధికారులు భావిస్తున్నారు. కోట్లలో నష్టాన్ని అంచనా వేస్తున్నారు. దీంతో వ్యాపారులు, కస్టమర్లు ఆందోళన చెందుతున్నారు. వరదల వల్ల ఆ బ్యాంకు నుంచి కొట్టుకుపోయిన విలువైన వస్తువులు చోరీ కాకుండా ఉండేందుకు స్థానికులు అక్కడ కాపలా ఉన్నారు.



# ఇండోసోల్ వద్దు

నెల్లూరు, జూలై 7, కందుకూరు, సింగరాయకొండ సమీపంలోని కరేడు గ్రామం మండుతోంది. సారవంతమైన భూములు ఒక కంపెనీకి కట్టబెడతామంటే ఊరుకోబోమంటూ అక్కడి రైతులు రోడ్డెక్కారు. బంగారం పండే తమ భూములను వదిలి తామెక్కడకి పోవాలనేది వారి ప్రశ్న. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆక్కడి ప్రజలు ఇటీవల హైవే దిగ్బంధం చేయడంతో విషయం వెలుగులోనికి వచ్చింది. అక్కడి రైతులకు అన్యాయం జరుగుతోంది అంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల, ఃజఅ పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ ఆరోపిస్తున్నారు"కరేడు" గ్రామం ఉమ్మడి నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. పలువురు ఎనలిస్ట్‌లు, గ్రామ ప్రజలు చెబుతున్న దాని ప్రకారం గత వైసీపీ హయాంలో ఇండిసోల్ అనే కంపెనీ కోసం పీవీ మాడ్యూల్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి 5000 ఎకరాల భూమిని రామాయపట్నం పోర్టు సమీపంలో కేటాయించింది. అది జగన్ మోహన్ రెడ్డి సన్నిహితుల కంపెనీ అని ప్రజలకు రైతులకు అన్యాయం చేసి భూమిని అప్పజెబుతున్నారు అంటూ వామపక్షాలు, ప్రజలు ఆరోపించారు. 2024 ఎన్నికల ముందు ఆ భూ కేటాయింపులను మరింత పెంచారు. యువగళం పాదయాత్రలో భాగంగా పర్యటనకు వచ్చిన లోకేష్ ఆ సంస్థ జగన్ సన్నిహితులదే అని విమర్శలు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆ భూసేకరణ ఆపేస్తారని అనుకున్నామని కానీ ఆలా జరగలేదు అని గ్రామస్తులు అంటున్నారు. రామాయపట్నం సమీపంలో జగన్ ప్రభుత్వం కేటాయించిన భూముల్ని బీపీసీయెల్ రిఫైనరీ కోసం వెనక్కి తీసుకున్నారు. దానికి బదులు 'కరేడు' గ్రామం దగ్గర 8000 ఎకరాలపైగా భూమిని ఇండోసోల్ కంపెనీకి కేటాయించడం వివాదాస్పదమైందని అంటున్నారు వామపక్షాల నేతలు. "అప్పుడు జగన్, ఇప్పుడు కూటమి కేటాయించిన భూములు అత్యంత విలువైనవని చెబుతున్నారు రైతులు. "రెండేసి పంటలు పండించే భూమి. కాస్త లోతుగా తవ్వితే చాలు నీరు పడే సారవంతమైన భూములు. ప్రైవేటు కంపెనీకి కేటాయించడం ఏంటి. ఇదే ప్రాంతంలో ఎన్నో అప్‌ల్యాండ్ లేదా డ్రైల్యాండ్‌ను పరిశ్రమకు కేటాయించాలి. తమ భూముల్ని మాత్రం వదిలేయాలి" అని కరేడు గ్రామస్తుడు వెంకటేశ్వర్లు అంటున్నారు. కరేడు గ్రామానికి చెందిన భూములు వదిలేయాలని నేషనల్ హైవేని దిగ్బంధించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ అధికారులు వచ్చి వారికి నచ్చజెప్పి తాత్కాలికంగా ఆందోళన అదుపు చేయగలిగారు. ప్రస్తుతానికి గ్రామ సభలు ఏర్పాటు చేసి అక్కడ రైతులు ప్రజలతో సంప్రదింపులు జరుపుతున్నారు. "ఈ భూ కేటాయింపు వల్ల అటు ఇటుగా పదివేల మందికిపైగానే ప్రభావితం అవుతారు. ముందస్తుగా 4వేల ఎకరాల సేకరణకు రాత్రికి రాత్రి నోటిఫికేషన్ ఇచ్చారు" అని ఉద్యమ నాయకుడు మిరియం శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇలా రాత్రికి రాత్రే నోటిఫికేషన్ ఇవ్వడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ భూ సేకరణపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఈ ఆందోళన ప్రభావం కందుకూరు నియోజకవర్గంతోపాటు కొండేపి,కావలి లాంటి కీలక నియోజకవర్గాలపైనా పడే అవకాశం ఉందని ఎనలిస్ట్‌లు అంటున్నారు.అప్పట్లో భూకేటాయింపులు చేసిన వైసిపిగానీ, ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళుతున్న కూటమిగాని ఈ వివాదంపై నోరుమెదకపోవడం ఏంటని వైఎస్ షర్మిల, రామచంద్ర యాదవ్ లాంటి రాజకీయవేత్తలు విమర్శలు చేస్తున్నారు.

# రేషన్ పంపిణీలో కొత్త టెక్నాలజీ


విశాఖపట్టణం, జూలై 7,ఒకప్పుడు రేషన్ ఎలా తీసుకునే వాళ్లం, రేషన్ షాప్‌కు వెళ్లి మన దగ్గర ఉన్నరేషన్ కార్డుతో మ్యాన్‌వల్‌గా రాయించుకొని రేషన్ తీసుకునేవాళ్లాం. ఆ తర్వాత అందుబాటులోకి వచ్చిన ఈ పాస్ యంత్రాల ద్వారా ఫింగర్ ప్రింట్ లేదా, ఐరిస్ స్కాన్ ద్వారా ఇప్పుడు రేషన్ తీసుకుంటున్నాం. అయితే ఈ యంత్రాల్లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గమనించిన ప్రభుత్వం రేషన్ సేకరణ విధానాన్ని మరింత సులబతరం చేసేందుకు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. అదే ఫేస్ అథంటికేషన్?. దీని ద్వారా మనం ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఒక్క ఫోటో దిగితే చాలు రేషన్ పొందవచ్చు. ప్రస్తుతం ఈ కొత్త టెక్నాలజీని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం విజయవంతంగా అమలు చేస్తోంది.పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ కింద అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయడానికి రాష్ట్రంలోని డిజిటల్ టెక్నాలజీ, గవర్నెన్స్ విభాగాన్ని ఈ నెల 1 తేదీ నుంచి ఆధార్ ఆధారిత ఫేస్ అథంటికేషన్? వ్యవస్థను ప్రారంభించింది. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా రేషన్ దుకాణాల్లో వినియోగదారుల ఫేస్‌ను స్కాన్ చేసి వారికి రేషన్ సరుకులను అధికారులు అందజుస్తున్నారు. ఈ ఫేస్ అథంటికేషన్? వ్యవస్థను విజయవంతంగా అమలు చేస్తున్న దేశంలో మొదటి రాష్ట్రంగా ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్? నిలిచింది.అయితే హిమాచల్ ప్రదేశ్‌లోనూ ఇప్పటి వరకు అన్ని రాష్ట్రాల్లో లాగా ఈ పాస్ యంత్రం ద్వారానే రేషన్ పంపిణీ ప్రక్రియ కొనసాగేది. కానీ ఈ యంత్రాల్లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా ప్రజలు గంటల తరబడి రేషన్ షాప్‌ల వద్దే వేచి చూసే పరిస్థితి వచ్చింది. దీంతో పౌరసరఫరాల శాఖకు ప్రజలు నుంచి ఫిర్యాదులు రావడం పెరిగాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈ సమస్యపై దృష్టిపెట్టిన ప్రభుత్వం.. వాటిని అదిగమించేందుకు ఈ ఫేస్ అథంటికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.ఈ కొత్త టెక్నాలజీని మొదటగా బిలాస్‌పూర్‌లో ప్రభుత్వం ట్రయల్‌రన్ నిర్వహించింది. అది సక్సెస్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని జిల్లాల జిల్లా ఫుడ్ కంట్రోలర్లకు ఈ కొత్త టెక్నాలజీని అములు చేయాలని ఆదేశాలను జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక రేషన్ దుకాణాలలో ఈ టెక్నాలజీని వినియోగించే రేషన్ డీలర్స్ ప్రజలకు రేషన్ పంపిణీ చేస్తున్నారుఈ ఫేస్ అథంటికేషన్ కూడా సేమ్ మన బయోమెట్రిక్ లానే పనిచేస్తుంది. ఈ పాస్ యంత్రంలో మన ఫింగర్ ప్రింట్ నమోదు చేసిన వెంటనే ఎలాగైతే మన వివరాలు వస్తాయో.. ఈ ఫేస్ అథంటికేషన్‌లో కూడా.. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా మన ముఖాన్ని స్కాన్ చేసిన వెంటనే, ఈ పాప్ యంత్రంలో వినియోగదారుల రేషన్ కార్డులో నమోదు అయి ఉన్న కుటుంబసభ్యులందరి పూర్తి వివరాలు వస్తాయి. అందులో మన పేరుపై క్లిక్ చేసి రేషన్‌ను మనం పొందవచ్చు. అయితే ఇందుకు రేషన్‌కార్డుకు కచ్చితంగా మన ఆధార్ లింక్ చేసి ఉండాలి.ఈ కొత్త టెక్నాలజీపై ప్రిన్సిపల్ అడ్వైజర్ గోకుల్ బుటెల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈపాస్ యంత్రం ద్వారా బయోమెట్రిక్ మ్యాచింగ్ వైఫల్య సమస్యలు ఎదుర్కొన్నామని.. వాటిని అదిగమించేందుకే ఈ ఫేస్ అథంటిఫికేషన్ వ్యవస్థను తీసుకొచ్చినట్టు తెలిపారు. రేషన్ డీలర్ స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసిన కెమెరాతో ముఖాన్ని స్కాన్ చేసి లబ్ధిదారుడిని గుర్తించవచ్చని ఆయన తెలిపారు. ఇందుకు కోసం సురక్షితమైన మొబైల్ అప్లికేషన్‌ను వినియోగిస్తున్నామని.. ఇది నెట్‌వర్క్ కనెక్టివిటీ లేదా బయోమెట్రిక్ హార్డ్‌వేర్‌పై ఆధారపడదని ఆయన తెలిపారు.




# 25 ఏళ్ల తర్వాత తీరనున్న కల

కాకినాడ, జూలై 7, కోనసీమ వాసులకు గుడ్ న్యూస్. అప్పుడెప్పుడో 2000లో ప్రారంభమైన ప్రాజెక్టు ఇన్నాళ్లకు కదలిక వచ్చింది. కోర్టు కేసులు ఇతర సమస్యలతో మూలనపడిన రైల్వే ప్రాజెక్టు ఇప్పుడు వేగంగా సాగుతందని ప్రజలు భావిస్తున్నారు. కోనసీమ రైల్వేలైన్ నిర్మాణానికి 2000లో శంకుస్థాపన చేశారు. కాకినాడ నుంచి కోటిపల్లి, అమలాపురం, రాజోలు, సిద్ధాంతం మీదుగా నర్సాపురం వరకు ఈ కోస్తా రైల్వే లైన్ నిర్మించాలని అప్పట్లో ప్రభుత్వం భావించింది. తొలి అలైన్‌మెంట్ 2001లో వచ్చింది. కాకినాడ నుంచి కోటిపల్లి వరకు పనులు కూడా మొదలయ్యాయి. వివిధ కారణాలతో అక్కడి నుంచి ప్రాజెక్టు ముందుకు కదల్లేదు. ఇప్పుడు కోర్టు కేసులు క్లియర్ కావడంతో ప్రక్రియ ముందుకు సాగే సూచనలు కనిపిస్తున్నాయి. రైల్వేలైన్ భూసేకరణ, రీ అలైన్‌మెంట్ సర్వేల విషయంలో చాలా మంది రైతులు కోర్టును ఆశ్రయించారు. అప్పట్లో తక్కువ పరిహారం ఇచ్చారని మరింత కావాలంటూ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. పరిహారంలో జరిగిన అన్యాయాన్ని సరి చేయాలని పాతికేళ్లుగా పోరాడుతున్నారు. దీంతో పనులపై ఇన్ని రోజులు కోర్టులు స్టే విధించాయి. ఇన్ని రోజులు విచారణ తర్వాత కోర్టులు ఆ స్టేలను ఎత్తివేస్తూ బుధవారం నిర్ణయం తీసుకుంది. దీంతో పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా పోయింది. 102.507 కిలోమీటర్ల పొడవుతో రైల్వేలైన్ నిర్మించాలని ప్లాన్ చేశారు. ఇందులో కాకినాడ నుంచి కోటిపల్లి వరకు అంటే దాదాపు 45కిలోమీటర్ల నిర్మాణం పూర్తి అయింది. ఇంకా యాభై కిలోమీటర్లకు పైగా లైన్ నిర్మించాల్సి ఉంది. కోటిపల్లి నుంచి నర్సాపురం ఉన్న భూసేకరణ సమస్యతో పనులకు ఆటంకం ఏర్పడింది. కోటిపల్లి నుంచి భట్నవిల్లి వరకు భూసేకరణ ప్రక్రియ పూర్తి అయింది. అక్కడి నుంచి నర్సాపురం వరకు చేపట్టాల్సిన భూసేకరణే ఈ ప్రాజెక్టుకు అడ్డంకిగా మారింది. ఏదోలా చేసి పనులు పూర్తి చేయాలని 2016 నుంచి జరుగుతున్న ప్రయత్నాలు సఫలం కాలేదు. పదేళ్లుగా గోదావరి మూడు నదీపాయలపై పిల్లర్ల పనులు పూర్తి చేశారు. మిగతా పనులకు టెండర్లు కూడా ఖరారు అయ్యాయి. కానీ పనుల్లో మాత్రం వేగం కనిపించలేదు. వైసీపీ ప్రభుత్వం ఈ రైల్వేలైన్ కోసం కావాల్సిన భూసేకరణకు చర్యలు చేపట్టింది. 2024 ఫిబ్రవరిలో 50 కోట్ల రూపాయల నిధులు కూడా మంజూరు చేసింది. అమలాపురం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలలో భూసర్వే కూడా చేపట్టారు. కానీ పనుల్లో పురోగతి కనిపించలేదు. కోర్టు కేసులతోపాటు అలైన్‌మెంట్‌లో వచ్చిన సమస్యలు కూడా పనులు జాప్యానికి కారణంగా చెప్పవచ్చు. 216 బైపాస్ నిర్మాణం కారణంగా రైల్వే ట్రాక్‌కు ఆనుకొని రోడ్డు వెళ్తోంది. దీని వల్ల రైల్వేట్రాక్ నిర్మాణం సరికాదని నిపుణులు అభిప్రాయపడ్డారు. రోడ్డు దిగిన వెంటనే ట్రాక్ దాటాల్సి ఉందని ఇది భవిష్యత్‌లో ప్రమాదాలకు కారణమవుతుందని కూడా తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని అంచనా వేశారు. ఈ సమస్యలు గుర్తించి అలైన్మెంట్ మార్చారు. బైపాస్ స్టార్ట్ కాక మందే రైల్వేలైన్ వెళ్లేలా ప్లాన్ చేశారు. దీని ప్రకారం భట్నవిల్లి, కామనగరువు, చిందాడగరువు, రోళ్లపాలెం, ఇమ్మిడివరప్పాడు, పేరూరుపేట మీదుగా బోడసకుర్రు రైల్వేలైన్ నిర్మాణం చేపట్టారు. ఈ ప్లాన్ ప్రకారం రెండు చోట్ల మాత్రమే 216 జాతీయ రహదారి మీదుగా రైల్వేలైన్ వెళ్తుంది. ఇప్పుడు కొత్త అలైన్మెంట్‌కు ఆమోదం, కోర్టు కేసులో ఎత్తివేయడంతో అధికారులు పనులు వేగం పెంచారు. భూసేకరణ ప్రక్రియ వేగం పెంచారు. ఈ సేకరణ పూర్తి అయితే పెండింగ్ పనులు పూర్తి కావడానికి ఎంతో సమయం పట్టదని అధికారులు అంటున్నారు.

# పవన్ మీద తొలుగుతున్న భ్రమలు



ఏలూరు, జూలై 7, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇంకా 2024 ఎన్నికల తరహాలోనే ఆలోచిస్తున్నారు. వైసీపీ పై విమర్శలు చేయడం మాని తమ ప్రభుత్వం ఏం చేయనుందో చెబితే బాగుంటుంది. మళ్లీ వైసీపీని అధికారంలోకి రానివ్వనంటూ శపథాలు చేసినంత మాత్రాన ఈసారి సాధ్యం కాకపోవచ్చు. 2024 ఎన్నికలకు,2029 ఎన్నికలకు చాలా తేడా ఉంటుంది. అప్పుడంటే పవన్ కల్యాణ్ ను అధికారంలో అప్పటి వరకూ ఎవరూ చూడలేదు. పవన్ కల్యాణ్ కు అధికారం ఇస్తే తమకు మంచిజరుగుతుందని భావించారు. అంతేకాదు కూటమి ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే శక్తి జనసేనానికి ఉందని నమ్మి ప్రజలు ఓటేశారు కానీ ఏడాదికే విషయం అర్థమయిపోయిందని జనసేన పార్టీ నేతలే అంటున్నారు. తాము మొన్నటి ఎన్నికల్లో పార్టీకోసం కష్టపడి జెండాను మోసి త్యాగాలు చేసినా అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోకపోయినా అడిగే నాధుడే లేని వాపోతున్నారు. అనేక మంది జనసేన నాయకుల్లో ఇదే అభిప్రాయం ఉంది. ప్రశ్నించే తత్వాన్ని పవన్ కోల్పోయారని, కేవలం రాజీ పడుతూ తన పదవి కోసమే ఉన్నారన్న కామెంట్స్ ఆ పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. తాము గత ఎన్నికల్లో ఖర్చు చేసి ఆర్థికంగా నష్టపోయినా తమను ఆదుకునే వారు కూడా లేరని అంటున్నారు. కోవూరు నియోజకవర్గం జనసేన నేత ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా ప్రస్తావించాలి. తాము అడుక్కుతింటున్నాపట్టించుకోరా? అని పవన్ కల్యాణ్ ను ప్రశ్నించారంటే పరిస్థితికి అద్దం పడుతుంది లీడర్లలోనూ... ఇది కేవలం జనసేన నేతలు మాత్రమే కాదు. క్యాడర్ లోనూ, కాపు సామాజికవర్గంలోనూ ఇదే అభిప్రాయం ఉంది. పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత తమను పూర్తిగా పక్కన పెట్టేశారని బహిరంగంగానే చెబుతున్నారు. నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు తమను పట్టించుకోవడం లేదని గోడు వెళ్లబోసుకుంటున్నా పట్టించుకునే వారు లేరని వారు ఆవేదన చెందుతున్నారు. కేవలం తన మంత్రిత్వ శాఖ విషయంపై చూసుకుంటూ పార్టీని పూర్తిగా వదిలేస్తే వచ్చే ఎన్నికల్లో జెండాను పట్టుకుని ఎవరు తిరుగుతారని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు జరిగి ఏడాది కాకముందే జనసేన క్యాడర్ లోనూ, నేతల్లోనూ, కాపు సామాజికవర్గంలోనూ పవన్ పై ఉన్న భ్రమలు తొలగిపోయాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి.. ఇక జనంలో కూడా పవన్ కల్యాణ్ ఈ ఏడాది కాలంలోనే పలుచన అయ్యారని చెప్పక తప్పదు. ఎన్నికల ప్రచార సభల్లో ఊగిపోయిన పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే తలూపడం మినహా మరేమీ చేయలేకపోతున్నారన్న బలమైన అభిప్రాయం ప్రజల్లో ఉందన్నది అనేక సర్వేల్లో వెల్లడవుతున్న వాస్తవాలు. ప్రభుత్వంలో ఉంటూ అధికార పక్షాన్ని నిలదీయమని చెప్పడం లేదు కానీ కనీసం ముఖ్యమైన సమస్యల విషయంలో చంద్రబాబు నాయుడు వద్ద ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయకుండా వైసీపీని మళ్లీ అధికారంలోకి రానివ్వనంటూ శపథాలు చేసినంత మాత్రాన సరిపోదని సోషల్ మీడియాలో కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. ముందుగా తమ పాలనపై సమీక్ష చేసుకుని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో భాగస్వామి కావాలని కోరుతున్నారు

# కొబ్బరి రైతులకు పండుగ...

అమలాపురం, జూలై 7, ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి రైతులకు ఇది నిజంగా పండుగ సమయం! చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కొబ్బరికి రికార్డు స్థాయి ధర లభించింది. వెయ్యి కొబ్బరి కాయల ధర ఏకంగా రూ.22 వేలు పలకడంతో రైతులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి తగ్గడంతో ఆంధ్రా కొబ్బరికి డిమాండ్ పెరిగింది. ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ధరలు రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం ఇస్తున్నాయి. పండించిన పంటకు మద్దతు ధర లభిస్తే.. అన్నదాతల కళ్లలో ఆనందం నిలుస్తుంది. వారు అన్ని రోజుల పడ్డ కష్టాన్ని మర్చిపోతారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి రైతుల పరిస్థితి కూడా ఇలానే ఉంది. చరిత్రలోనే తొలిసారి రికార్డు స్థాయిలో ధర పలికింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక జాతీయ మార్కెట్‌లో ఆంధ్రా కొబ్బరి రికార్డుల మీద రికార్డులు క్రియేట్ చేస్తుంది. కొబ్బరి చరిత్రలో తొలిసారి వెయ్యి కొబ్బరి కాయల ధర ఏకంగా 22 వేల రూపాయలు పలికింది. ఆవివరాలు..ఈఏడాది ఆంధ్రా మినహా మిగిలిన దక్షిణాది రాష్ట్రాల్లో అనగా.. తమిళనాడు, కర్ణాటక, కేరళలలో కొబ్బరి కాయల దిగుబడి భారీగి తగ్గిపోయింది. ఇది కాస్త ఆంధ్రా కొబ్బరి రైతులకు కలిసి వచ్చింది. పంట దిగుబడి సరిగా లేకపోవడం చేత... కొబ్బరి చరిత్రలో తొలిసారి అంబాజీపేట మార్కెట్‌లో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.22 వేలు పలికింది. లంక గ్రామాల్లో అయితే వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.23 వేల వరకూ పలుకుతోందని రైతులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోనే కొబ్బరి సాగుతుంది. రెండు జిల్లాల్లో కలిపి సుమారు 1.8 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుండగా.. ఒక్క కోనసీమ జిల్లాలోనే 1.10 లక్షల ఎకరాల్లో



కొబ్బరి సాగు చేస్తున్నారు రైతులు. ఇక గత సంవత్సరం నుంచి కొబ్బరి ధర రూ.10 వేలకు తగ్గడం లేదు. పచ్చికాయ, నిల్వ కాయ ధరలు ఇలానే స్థిరంగా కొనసాగుతున్నాయి. ఇక గతేడాది వే నెలలో ఒకానొక సందర్భంలో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.12 వేల వరకూ పలికింది. ఇక ఈ ఏడాదిమే చివరి వారంలో రూ.16 వేలకు చేరింది.ఈ నెల అనగా జూన్ మొదటి వారంలో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.17,500 నుంచి రూ.18,500 వరకూ పెరిగింది. ఈ ధరలు ఇలానే పెరుగుతూ వస్తూ.. శనివారం నాడు ఏకంగా రూ.22 వేలు పలికింది. రానున్న వారం రోజుల్లో కొబ్బరి ధర మరింత పెరిగే అవకాశం ఉంది అంటున్నారు. ఇక దక్షిణాది రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడి భారీ స్థాయిలో పడిపోయింది. ఇక కేరళలో కొబ్బరి దిగుబడి మరింత పతనమైంయింది. దీంతో మార్కెట్‌లో కొబ్బరికి భారీ ఎత్తున్న డిమాండ్ ఉండటతో.. మంచి ధర పలుకుతుంది.పోయిన సంవత్సరం నుంచి రైతుల వద్ద కానీ, వ్యాపారుల వద్ద కానీ కొబ్బరి నిల్వ ఉండటం లేదు. వచ్చిన పంట వచ్చినట్లే అమ్ముడవుతుంది. ఇక ప్రస్తుతం కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండటంతో వారం రోజుల వ్యవధిలోనే ఎగుమతి అవుతోంది. ధరల పెరుగుదలకు ఇది కూడా ఓ కారణం అంటున్నారు. ఇక ఏపీ నుంచి హర్యానా, బిహార్, యూపీ, గుజరాత్, మహారాష్ట్రలకు పచ్చికాయ అధికంగా ఎగుమతి అవుతోంది.

## మూడు జిల్లాల్లో తమ్ముళ్ల డిష్యూం.. డిష్యూం...

కర్నూలు, జూలై 7, ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు నడుస్తుంది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పార్టీ అధినేతగా పార్టీని 2029 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తేవాలని భావిస్తుంటే నేతలు మాత్రం విభేదాలతో వెనక్కు లాగుతున్నట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు గ్రూపులతో కొట్లాడుకు కుంటున్నారు. బాహాబాహీకి దిగుతున్నారు. ఇది ఏ ఒక్క ప్రాంతానికో పరిమితమయితే దానిని సర్దుబాటు చేయవచ్చు. కానీ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చంద్రబాబు నాయుడు, లోకేశ్ మాటలను కూడా బేఖాతరు చేస్తూ కొందరు నేతలు వ్యవహరిస్తున్న తీరు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. ఇలాగే కొనసాగితే 2029 ఎన్నికల్లో గెలుపు సంగతి పక్కన పెడితే ఎన్నిసీట్లు వస్తాయన్నది కష్టమేనని టీడీపీ సోషల్ మీడియాలోనే కామెంట్స్ వినపడుతున్నాయి. నంద్యాల జిల్లాలో డిష్యూం.. డిష్యూం... నంద్యాల జిల్లాలో పరిస్థితి తీసుకుంటే అక్కడ పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరికి, ఎమ్మెల్యేలకు పొసగడం లేదు. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి సమాచారం లేకుండా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ఆ నియోజకవర్గానికి రావడంతో బుడ్డా అనుచరులను ఆమెను అడ్డుకున్నారు. మరొక వైపు ఏరాసు ప్రతాప్ రెడ్డి ఇంటిపై కూడా దాడికి దిగారు. తాము సమాచారం ఇచ్చినా బుడ్డా రాజశేఖర్ రెడ్డి కార్యక్రమానికి హాజరు కాలేదని బైరెడ్డి అనుచరులు చెబుతున్నప్పటికీ ఈ గ్యాప్ మరింత పెరిగేదిగానే ఉంది. కేవలం బుడ్డాతో మాత్రమే కాదు.. బైరెడ్డి శబరికి మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా సఖ్యత లేదని తెలుసుకున్న అధినాయకత్వం ఆమెను అమరావతికి పిలిపించింది. మహానాడును కడప జిల్లాలో పెట్టి పదికి పది పదిస్థానాలను కైవసం చేసుకోవాలని చంద్రబాబు పిలుపు నిస్తే పులివెందుల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ ఇన్ ఛార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇద్దరి మధ్య అధికారులు, కార్యకర్తలు నలిగిపోతున్నారు. మరొక వైపు కడప నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవి రెడ్డికి, పట్టణ పార్టీ అధ్యక్షుడికి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇక ప్రొద్దుటూరులోనూ అంతే. కమలాపురం నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. ఇక అనంతపురం పట్టణ నియోజకవర్గంలో టీడీపీ ద్వితీయ శ్రేణి నేతను హత్యకు ప్లాన్ ఎమ్మెల్యే అనుచరులు ప్లాన్ చేశారన్న ఆరోపణలతో కొంత పార్టీ ఇబ్బంది పడింది. ఇక కల్యాణదుర్గం నియోజకవర్గంలో స్టాంపుల కుంభకోణంలో అమిలినేని సురేంద్ర బాబుపై ఆరోపణలు రావడం వెనక టీడీపీ నేత ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు ఉన్నం మారుతి ఉన్నారన్న విషయం తేలింది. చిత్తూరు జిల్లాలోనూ ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. చిత్తూరు జిల్లాలో కూడా అనేక నియోజకవర్గాల్లో నేతలకు, ద్వితీయ శ్రేణి నేతలకు మధ్య పొసగడం లేదు. గ్యాప్ ఎంతగా పెరిగిందంటే గత నాలుగు రోజులుగా జరుగుతున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలతో ఎవరూ పాల్గొనకపోవడం దీనికి అద్దం పడుతుందని అంటున్నారు.

## కుంటు పడుతున్న కుక్కల కూని అప్రేషన్లు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 07 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కుంటుపడుతూనే ఉన్నాయి. కుక్కల శస్త్రచికిత్స సెంటర్ మరమ్మ తులకు 3-60 వేలు మంజూరు చేసారు. కానీ పనులు నాసిరకంగా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తు న్నాయి .శస్త్ర చికిత్స సెంటర్ లో మున్సిపాల్టీకి సంబంధించిన మోటర్. మరియు గ్యాస్ పొయ్యి. సిలిండర్లు కనపడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి . పట్టణంలో శునకాలు భయ పెడుతున్నాయి. చిన్నారులకు ఒంటరిగా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది . రాత్రి వేళ పెద్దవాళ్లు జంకుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంటపడి కరిచేస్తున్నాయి. ఇలా కుక్క కాటు బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. పట్టణంలో ఎక్కడా పూర్తి స్థాయిలో లెక్కింపు పనులు చేపట్టక పైపై లెక్కలు వేశారు. నంద్యాలలో 15 వేలు పశు సంవర్ధన శాఖ లెక్కల ప్రకారం తేల్చారు. కుక్కలకు గర్భధారణ నియంత్రణ శస్త్రచికిత్సల పేరుతో మున్సిపాలిటీ లో నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో శునకానికి రూ. 1000-1350 వ్యయ చేశారు. వీటికి లెక్కలు లేకపోవడం తనిఖీలు లేక ఇష్టారీతిగా లక్షలు పక్కదారి పట్టించారని కార్యాలయంలోనే గుసగుసలువినిపిస్తున్నాయి.కుక్కలసంఖ్య పెరగకుండా జంతు నియంత్రణ నిబంధనలు- 2023 ప్రకారం సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలని పలువురు కోరుతున్నారు . యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ తొందరగా నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కానీ ఇంతవరకు తలుపులు తెరవలేదు. అధికారులను వివరణ అడిగితే మాట దాటవేస్తున్నారు.

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 75 ఫిర్యాదులు... జిల్లా ఎస్పీ. అధిరాజ్ సింగ్ రాణా.




- - విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 07-నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 75 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయని తెలిపారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ .యుగంధర్ బాబు పాల్గొన్నారు..

## మాజీ కౌన్సిలర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 07-పట్టణంలో సోమవారం మాజీ కౌన్సిలర్ చిలుకల వెంకటసుబ్బయ్య గౌడ్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి , ఎమ్మెల్సీ ఇషాక్ బాషా పరామర్శించారు. మాజీ కౌన్సిలర్ చిలుకలవెంకటసుబ్బయ్య గౌడ్ వారి మాతృమూర్తి మాజీ కౌన్సిలర్ చిలుకలలక్ష్మీ దేవమ్మ శుక్రవారం నాడు అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ భాష మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి మా కుటుంబానికి అండగా నిలుస్తున్నారని వారి సేవలను మర్చిపోలేమన్నారు. అదేవిధంగా వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మాజీ కౌన్సిలర్ పుల్లమ్మ, అడ్వకేట్ రామసుబ్బయ్య, మాధవస్వామి,మాధవ రెడ్డి ,యూనిస్ ,బషీర్, అహ్మద్ ,,రామచంద్రుడు ,ఎద్దురవి,నేసప్రసాద్, రవికుమార్, హుస్సేన్ రెడ్డి, షేక్ షా, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన 85 ఫిర్యాదులకు విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం... - జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.



విభారే న్యూస్ జులై 07 కర్నూలు జిల్లా ప్రతినిధి..ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 85 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.ఏపీకే ఫైల్స్ ను గాని, తెలియని లింకులు గాని మొబైల్ కు వస్తే క్లిక్ చేయకూడదు. డౌన్ లోడ్ చేయాకూడదు.ఎపికె ఫైల్స్ ను క్లిక్ చేసినట్లయితే సైబర్ నేరగాళ్ళు మీ మొబైల్ ను హ్యాక్ చేస్తారు.మీ బ్యాంకు ఖాతాలలోని డబ్బులను దోచేస్తారు, మోసపోతారని ప్రజలకు విజ్ఞప్తి చేసిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 85 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని 1) పిఎమ్ కిసాన్ పేరుతో ఏపీకె ఫైల్ నా మొబైల్ కి రావడంతో తెలియక నేను దానిని క్లిక్ చేశాను.నాకు తెలియకుండా నా మొబైల్ నెంబర్ ఉన్న గ్రూపులలోకి కూడా ఏపీకె ఫైల్ వెళ్ళింది.తర్వాత నా ఎస్ బి ఐ ఖాతా నుండి రూ. 1 లక్ష 96 వేలు పోయాయని న్యాయం చేయాలని కర్నూలు , కల్లూరు మండలం కు చెందిన బాధితుడు ఫిర్యాదు చేశారు.2) కర్నూలులోని ఎదో ఒక స్కూల్ లో బయోలజి టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలుకు చెందిన లక్ష్మమయ్య రూ. 6 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు , తిలక్ నగర్ కు చెందిన యువరాజు ఫిర్యాదు చేశారు. 3) బెంగుళూరు ఆరిజనో ఇన్ఫో టెక్నాలజీ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అనంతపురంకు చెందిన బాబు మాకు శిక్షణ ఇప్పించి, ప్రాజెక్ట్ వర్క్ పేరుతో రూ. 2 లక్షలు తీసుకొని, వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో 6 నెలలపాటు పని చేయించుకుని ఒక నెల మాత్రమే జీతం డబ్బులు ఇచ్చి మోసం చేశారని కర్నూలు, ముజఫర్ నగర్ కు చెందిన అభిలాష్ ఫిర్యాదు చేశారు.4) వడ్డేగేరి కి చెందిన ఖాజా ఖాన్ గ్లాస్ వర్క్ పని చేస్తున్నాడు. ఇన్ స్ట్రా గ్రామ్ లో నా భర్త పేరుతో ఫేక్ ఐడి సృష్టించి ప్రముఖులను దుర్భాషలాడుతూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని న్యాయం చేయాలని కర్నూలు కు చెందిన ఫసియా ఫిర్యాదు చేశారు. 5) ఒక ఎకర 20 సెంట్ల నా పొలాన్ని జిల్లా సర్వేయర్ కొలతలు వేసినా కూడా ఉగాది జయన్న దౌర్జన్యంగా నా పొలాన్ని ఆక్రమించుకున్నారని కర్నూలు, ప్యాలకుర్తి కు చెందిన పెరుగు నగేష్ ఫిర్యాదు చేశారు.6) నంద్యాల, ఆటో నగర్ కు చెందిన కుర్వ ఈరన్న ధరణి ఆటో గ్యారేజిలో పని చేస్తూ మా శక్తి మాన్ ట్రాక్టర్ ఇంజిన్ కు నెలకు రూ. 20 వేలు బాడుగకు ఇస్తానని తీసుకెళ్ళి 8 నెలలు అయిన కూడా ట్రాక్టర్ తో పాటు ఎక్కడికి వెళ్ళి పోయాడో ఇంతవరకు తెలియదని, ఫైనాన్స్ ఆఫీసు వాళ్ళు కంతులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని ఆదోని, ఇస్వి గ్రామానికి చెందిన రామాంజినేయులు, మల్లప్పలు ఫిర్యాదు చేశారు.7) నకిలి డెత్ సర్టిఫికెట్లు సృష్టించి,దొంగ రిజిస్ట్రేషన్ తో ఆస్తి మొత్తాన్ని కాజేయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు,కుమ్మరి స్ట్రీట్ కు చెందిన రాకేష్ ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి,బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐ లు పాల్గొన్నారు.

## బుట్టా రేణుక,పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠని శ్రీ గురు పౌర్ణమి మహోత్సవానికి ఆహ్వానించిన సేవాసమితి సభ్యులు.



విభారే న్యూస్ జూలై 7 ఎమ్మిగనూరు..సోమవారం రోజు పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మిగనూరు వై.యస్.ఆర్.సి.పి ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక ని పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠని 10-7-2025( గురువారం ) తేదీన శ్రీ గురు పౌర్ణమి సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించిన సేవా సమితి సభ్యులు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, ఎమ్మిగనూరు నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు/ మునిసిపాల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు,నాగరాజు స్వామి, వెంకటేష్,సుధాకర్, గోపాల్ స్వామి,విశ్వనాథ్, శ్రీనివాసులు, చంద్ర, రాముడు, రంగస్వామి, మహిళా నాయకురాలు లతా రెడ్డి, గోవిందమ్మ, శారద, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థిక అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

## శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి -

ఆత్మకూరు: మహిళలకు ఆర్థిక అవకాశాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దోహదపడుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హల్ నందు మెప్మా సంఘాల సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కి మున్సిపల్ చైర్మన్ ఆసియా, కమిషనర్ రమేష్ బాబు, మెప్మా టిఎంసి వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. అనంతరం సంఘాల నిర్వహణకు గానూ ఎంపికైన ఆర్పీ లకు ఆధునిక ట్యాబ్ లు, డీజీ లక్ష్మి కేంద్రాల ఏర్పాటుకు ఎంపికైన వారికి డివైజ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు ఆర్థిక అవకాశాలు పెంపొందించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. వీటిని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష, టిడిపి నాయకులు, మెప్మా సంఘాల లీడర్లు సరోజ, ఉమాదేవి, పొదుపు ఆర్పీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

### అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 07--: ప్రజల నుంచి వచ్చే వినతుల్ని సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సూచించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు సంబంధిత అధికారుల తో సోమవారం మున్సిపల్ కార్యాలయం లో కూర్చున్నారు . ముగ్గురు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారని తెలిపారు. వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారికి అసిస్టెంట్ కమిషనర్ ఆదేశించారు. సహాయ కమిషనర్ వెంకట దాస్. రెవెన్యూ అధికారి. ఎస్. వెంకటరెడ్డి. టౌన్ ప్లానింగ్ అధికారి నాయక్. శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. ఏఇ మనోహర్. సీనియర్ అసిస్టెంట్లు వేణు. జిలాని బాష. జూనియర్ అసిస్టెంట్లు. రాంప్రసాద్. ఛరణ్. రేణుక. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## 10 వ తేదీ గురువారం ఆషాడ పౌర్ణమి సందర్భంగా సూర్య దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం...



విభారే న్యూస్ కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 07..శ్రీసూర్య నారాయణ స్వామి వారి దేవాలయంలో 10-07-2025, గురువారం ఆషాడ పౌర్ణమి సందర్భంగా శ్రీ రమా సహిత శ్రీ సత్య నారాయణ స్వామి వారి వ్రతములు అత్యంత వైభవోపేతంగా జరుగును..శ్రీ సత్య నారాయణ వ్రతం, శ్రీ స్వామి వారికి అత్యంత ప్రియమైనది.కావున భక్తులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని శ్రీ రమా సహిత శ్రీ సత్య నారాయణ స్వామి వారి కృప కు పాత్రులై తమ ఇష్ట కామ్యాలను పొందగలరు.గమనిక:- ప్రధానంగా వ్రతం చేస్తున్న భక్తులు ఉదయం 8:45 నిమిషాలకు సంప్రదాయ దుస్తులతో రావాలని మనవి.. వ్రతములో భక్తులు దయచేసి పూజారికి సహకరించగలరు.వ్రతం ప్రధానంగా -1116/-వ్రత సంకల్పం - 116/-సంప్రదించండి :-శ్రీధర్ శర్మ -7995202082దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్.. 8896123777ఆఫీసు లాండ్ ఫోన్ నెంబర్:08518-234388.

## బుట్టా రేణుక ని మర్యాదపూర్వకంగా కలిసిన కలుగట్ల గ్రామ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.



విభారేన్యూస్ఎమ్మిగనూరుజూలై7..సోమవారంరోజుపట్టణంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ పార్లమెంటు సభ్యురాలు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్, శ్రీమతి బుట్టా రేణుక ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మినూరు మండలం కలుగట్ల గ్రామం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.ఈ కార్యక్రమంలో కలుగొట్ల సర్పంచ్ అబ్రహం,మాజీ సర్పంచ్ చంద్ర, మాజీ ఎంపిటిసిలు ఈరన్న గౌడ్, ఆదాం, మాజీ డీలర్ కృష్ణన్న గౌడ్, మద్దిలేటి గౌడ్, పరుశురాం గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గోరువ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## బుట్టా రేణుకని మర్యాదపూర్వకంగా కలిసిన మెకానిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాదిక్.

విభారే న్యూస్ ఎమ్మిగనూరు జూలై 7..సోమవారం రోజు పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మిగనూరు వై.యస్.ఆర్.సి.పి ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుకని మర్యాదపూర్వకంగా కలిసిన మెకానిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాదిక్ వారి స్నేహ బృందం అమీర్, లక్ష్మణ్, హుస్సేన్, గౌస్, ప్రేమ్, కలిసి హృదయ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కర్నూల్ జిల్లా సోషల్ మీడియా ఉపాధ్యక్షులు సయ్యద్ చాంద్,15 వార్డ్ వైస్సార్సీపీ ఇంచార్జ్ ఫయాజ్ అహ్మద్, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190